



పకడ్బందీగా జరిగేనా?

- రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న విద్యార్థులు 13,748 మంది

డిపార్ట్‌మెంటల్ అధికారులు లేకపోవడంపై విమర్శలు

నంద్యాల (నూనెపల్లె), మే 22: జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కూడా పూర్తయింది. అయితే ఈసారి డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించకుండా చీఫ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లతో పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో పర్యవేక్షణ లోపించే అవకావం ఉందన్న విమర్శలు అధ్యాపక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో నంద్యాల జిల్లా కేంద్రంతోపాటు తదితర ప్రధాన పట్టణ ప్రాంతాలలో 31 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 9350, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4398 మొత్తం జిల్లాలో 13,748 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. 31 పరీక్షా కేంద్రాలకు 68 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పర్యవేక్షణపై ఆందోళన

గతంలో ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు అసిస్టెంట్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉండేవారు. ప్రస్తుతం డిపార్ట్‌మెంటల్ అధికారులు లేకుండా మిగిలిన ఇద్దరిని మాత్రమే నియమించారు. దీని వల్ల పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ లోపించే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు బయట వ్యక్తులను నియమించినా ప్రభుత్వ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కొన్ని కేంద్రాల్లో అదే కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అలాంటి కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అదే కళాశాలకు చెందిన వారు కావడంతో కాపీలు జరగటానికి ఆస్కారం లేకపోలేదు. దీంతో కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోయే అవకాశాలు ఉంటాయని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జంబ్లింగ్ విధానంలో పరీక్షలు- సునీత, డీవీఈవో, నంద్యాల

పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించలేదు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు రాయడం వల్ల ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలో రాసే అవకాశం లేదు. కొన్ని చోట్ల పరీక్షా కేంద్రాలు దూరంగా ఉండటంతో ఆ కళాశాల విద్యార్థులు వేరే కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో అక్కడే పరీక్షలు రాయనున్నారు. ఆ కేంద్రాలలో సీపీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక స్క్వాడ్‌ను కూడా నియమించాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.





అందుబాటులోకి రాని

అగ్రి ల్యాబ్

- నిరుపయోగంగా పరికరాలు
- భూ శాంపిల్స్ సేకరణ నిల్
- ల్యాబ్ ఏర్పాటుకు రూ.3 కోట్లు
- భవనానికి రూ.55 లక్షలు
- పరికరాలకు రూ.2.45 కోట్లు
- మంజూరైంది రూ.66 లక్షలు మాత్రమే
- 30 పరికరాలకు గాను అందుబాటులో 11
- 11 నెలలు కావస్తున్నా సీల్ తియ్యని వైనం

నందికొట్కూరు, మే 22: మరో 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. వర్షాలు ముందస్తుగా ఉండడంతో రైతులు ఈసారి ఆశాజనకంగా సాగుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటి భారీ నుంచి రైతులను రక్షించేందుకు నియోజకవర్గస్థాయిలో ఒక అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే నందికొట్కూరులో 11 నెలలు కావస్తున్నా.. డా.వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ ఉత్సవ విగ్రహంలానే ఉంది. నియోజకవర్గ స్థాయిలో ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు ఈ ల్యాబ్‌ను రూ.3 కోట్లతో నిర్మించ తలపెట్టారు. అయితే సీజన్ మొదలవుతున్నా విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించాల్సి ఉండగా 11 నెలలు అవుతున్నా పూర్తి స్థాయిలో పరికరాలు అందలేదు. దీంతో ఇదివరకే వచ్చిన అరకొర పరికరాలను కూడా ఓపెన్ చేయలేని దుస్థితి నెలకొంది. పూర్తి స్థాయిలో పరికరాలు లేకపోవడంతో వచ్చిన పరికరాలతో విత్తనాలను, ఎరువులను పరీక్షించడం సాధ్యం కాదని, అందుకే వాటిని అలాగే ఉంచామని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. దుకాణాలకు ఎరువులు, విత్తనాలు దిగుమతి అవుతున్నాయి. కాని పరికరాలు లేకపోవడంతో ఈసారి కూడా నకిలీలను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు నకిలీలను వాడాల్సి వస్తుందని వాపోతున్నారు.

● ఈ ఏడాది ఉపయోగపడేనా?:

నాసిరకం విత్తనాలు, నాసిరకం ఎరువుల నుంచి రైతులను కాపాడేందుకు ఈ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో డా.వై.ఎస్.ఆర్. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ల్యాబ్‌ను ప్రారంభించి 11 నెలలు కావస్తున్నా నిధులు ప్రభుత్వం కేటాయించలేదు. వచ్చిన అరకొర పరికరాలు కూడా ఉపయోగంలో లేవు. పరికరాలు ఉన్న గదులకు అధికారులు తాళాలు కూడా తీయలేదు. ఈ ల్యాబ్‌లో ఏవో కలిమున్నిసా, ఏఈవోలు బిచ్చారెడ్డి, లక్ష్మీప్రసన్న, పశుసంవర్థక శాఖకు సంబంధించి ఒక లైవ్‌స్టాక్ సిబ్బంది అనలిస్టు, ఒక అటెండర్ ఉన్నారు. పరికరాలు లేని ల్యాబ్ ఈ ఏడాది రైతులకు అందుబాటులోకి వస్తుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన అన్ని నియోజకవర్గాలకు పరికరాలు వచ్చాయని... త్వరలోనే నందికొట్కూరు అగ్రిల్యాబ్‌కు కూడా పరికరాలు వస్తాయని ఏవో కలిమున్నిసా చెబుతున్నారు.

● ఉత్సవ విగ్రహంలా ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ :

ఎరువులను, విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు 2023 జూలై 8న డా.వై.ఎస్.ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అందులో భాగంగా నందికొట్కూరులోని డా.వై.ఎస్.ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయి డా. వై.ఎస్.ఆర్. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. అయితే ఈ నిధుల్లో ల్యాబ్ భవన నిర్మాణానికి రూ.55 లక్షలు, మరో రూ. 2.45 కోట్లతో మరో రూ.6 లక్షలతో పశుసంవర్థక శాఖకు, ఎరువులు, విత్తనాలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించారు. అయితే ఇందులో కేవలం రూ.6 లక్షల విలువ చేసే (గ్లాస్‌వేర్, హాక్‌ఎయిర్ ఓవెల్, వి.హెచ్. మీటర్, వాటర్ సేకింగ్ బాత్, డిజిటల్ వేయింగ్ బ్యాలెన్స్) పరికరాలు రాగా ఇంకా అగ్రికల్చర్‌కు సంబంధించి కోటి రూపాయల విలువ చేసే పరికరాలు రావాల్సి ఉండగా, క్యాబినెట్ జర్మినేడర్, డిజిటల్ మైక్రో స్కోప్, ప్యూరిటీ వర్క్ బోర్డు, సీడ్ బ్లోయర్, సీడ్ డివైడర్, రెండు కంప్యూటర్లు అధికారులు చెబుతున్నారు. ల్యాబ్‌కు 30 రకాల పరికరాలు రావాల్సి ఉండగా 11 మాత్రమే వచ్చాయని అధికారులు చెబుతున్నారు. రూ.2.39 కోట్ల విలువ చేసే పరికరాలు ల్యాబ్‌కు రావాల్సి ఉందని వారు చెబుతున్నారు.







ఓట్ల లెక్కింపునకు
పకడ్బందీ ఏర్పాట్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ సీహెచ్ విజయరావు

నంద్యాల క్రైం, మే 22: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయ పరిధిలోని కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు



చేసుకోవాలన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద నిర్ణీత దూరంలో అందరూ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. పెట్రోల్‌బంకులకు నోటీసులు జారీ చేసి పెట్రోల్‌ను బాటిళ్లలో, క్యాన్లలో అమ్మకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ బాణాసంచాల నిల్వలు లేకుండా గట్టిచర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు దాడులు, తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అందుబాటులో ఉండేవిధంగా చూడాలని సూచించారు. ఈ నెల 30నుంచే ప్రతి జిల్లా సరిహద్దు ప్రవేశం, నిష్క్రమణల దగ్గర చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీలు, పోలీస్ అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి బందోబస్తు ప్రణాళికపై చర్యలు తీసుకుని బ్రీఫింగ్ చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఎస్సై స్థాయి అధికారిని అబ్జర్వేషన్ అధికారిగా కేటాయించాలని పేర్కొన్నారు. ట్రబుల్‌మాంగర్స్‌ను బైండోవర్ చేయాలని డీఐజీ సీహెచ్ విజయరావు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మే 22: జిల్లాలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపులో ఎన్నికల నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం సాయుధ దళాలతో నాలుగు రోడ్ల కూడలిలో, ఆర్టీసీ బస్టాండు నుంచి నిర్వహించిన పోలీసు కవాతులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసు కవాతు నిర్వహించామని అన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల పెద్దలు ప్రజలతో మమేకమై వివాదాలకు దూరంగా ఉండాలే చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని అన్నారు. జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజున కౌంటింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఎవరూ అనవసరంగా కౌటింగ్ పరిసర ప్రాంతాలకు రావద్దని కోరారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు, వారికి సంబంధించి వ్యక్తులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు జరుపుకోరాదని, బాణసంచా కాల్చడానికి ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. ఎలాంటి వ్యక్తులైనా సరే శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంతనాయక్, ఎస్ఐలు నరసింహులు, నగీనా, వెంకటరెడ్డి, కేంద్ర సాయుధ దళాలు, పోలీసులుపాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలను
అరికట్టండి: కలెక్టర్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మే 22: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన ఇసుక అక్రమ తవ్వకాలపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీఓలు, మండల తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు, పోలీసు అధికారులతో ముమ్మర తనిఖీలు నిర్వహించాలని అన్నారు. పర్మిట్‌లేని ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీజ్ చేసేలా చూడాలని ఉప రవాణా అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా గనులు, భూగర్భ శాస్త్ర అధికారి రామచంద్ర, ఉప రవాణాశాఖ అధికారి శివారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

10 వతరగతి, ఇంటర్‌మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుండి వచ్చే నెల 1వతేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు డీటీలను కేటాయించాలని డీఆర్‌ఓను ఆదేశించారు.

27లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్ల ఏర్పాటు కోసం ఈ నెల 27వ తేదీలోగా (ఫామ్ -18)దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల మొబైల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి

నంద్యాల (కల్చరల్), మే 22: నెట్ వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు సంబంధిత యాజమాన్యాలను సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నెట్‌వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాణాపాయ, అత్యవసర కేసులకు ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాలకు సూచించారు. పెండింగ్‌లో వున్న బిల్లుల బకాయిలన్నింటినీ ప్రభుత్వం త్వరలో చెల్లిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే 2300 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, మిగిలిన బకాయిలు కూడా విడతల వారిగా ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు. నెట్ వర్క్ హాస్పటల్ యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, డీయంహెచ్‌ఓ, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంఖ్యపై గెలుపు ధీమా



● డోన్ అసెంబ్లీ నుంచి 1994, 2004 ఎన్నికల్లో గెలిచిన కోట్ల కుటుంబం

● 2024లోనూ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుస్తారని నమ్మకం

డోన్, మే 22: డోన్ అసెంబ్లీ నుంచి పోటీ చేసిన సంవత్సరం సంఖ్యపై కోట్ల కుటుంబం గెలుపు ధీమా వ్యక్తం చేస్తోంది. పోటీ చేసిన సంవత్సరం సంఖ్య కోట్ల కుటుంబానికి కలిసొస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లోనూ టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి గెలుస్తాడనే ధీమాతో టీడీపీ వర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం డోన్ నియోజకవర్గంలో కోట్ల కుటుంబం పోటీ చేసిన సంవత్సరం సంఖ్యపై ఆసక్తికర చర్చ సాగుతోంది. 1994 సంవత్సరం ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి సీఎం హోదాలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో కోట్ల కుటుంబం కోడలుగా కోట్ల సుజాతమ్మ డోన్ నియోజకవర్గ రాజకీయాల్లో అడుగు పెట్టారు. అప్పుడు జరిగిన ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోట్ల సుజాతమ్మ గెలు పొంది సంచలనం సృష్టించారు. మళ్లీ ఇప్పుడు 2024 ఎన్ని కల్లో డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బరిలో నిలిచారు. దీంతో పోటీ చేసిన సంవత్సరం సంఖ్యపై టీడీపీ వర్గాలు ఎన్నో అంచనాలు పెట్టుకున్నాయి. 1994, 2004 సంవత్సరాల ఎన్నికల్లో కోట్ల కుటుంబం గెలుపొందిందని, ఇప్పుడు 2024 ఎన్నికల్లోనూ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుస్తారనే ధీమాను టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. సంవత్సరం సంఖ్య కోట్ల కుటుంబానికి కలిసొస్తుందని, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది.

● కోట్ల సుజాతమ్మ కొండంత బలం:

టీడీపీ కూటమి డోన్ అభ్యర్థిగా పోటీ చేసిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ కొండంత బలంగా నిలిచారు. డోన్ నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా కోట్ల సుజాతమ్మ పని చేశారు. రెండోసారి అధికారంలో ఉండి మాజీ ఎమ్మెల్యేగా కోట్ల సుజాతమ్మ నియోజకవర్గ ప్రజలకు సేవలందించారు. దీంతో డోన్ నియోజకవర్గంలో కోట్ల సుజాతమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా డోన్ నుంచి పోటీ చేసిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి కోట్ల సుజాతమ్మ అన్ని తానై వెన్నంటూ నడిచారు. తన భర్త కోట్ల గెలుపు కోసం నియోజకవర్గంలో కోట్ల సుజాతమ్మ అలుపెరుగని పోరాటం చేశారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి టీడీపీ గెలుపు కోసం కోట్ల సుజాతమ్మ శ్రమించారు.

● గెలుపుపై కోట్ల అంచనాలెన్నో..

డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ గెలుపుపై కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎన్నో అంచనాలను వేసుకున్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసి పది రోజులు కావడంతో ఇప్పటికే పలుమార్లు లెక్కల బిజీలో కోట్ల ఉన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ బూతుల వారిగా పోలైన ఓట్లపై కోట్ల ఆరా తీశారు. ఏ మండలంలో టీడీపీకి ఎంత మెజారిటీ వస్తుందన్న దానిపై అంతర్గతంగా సర్వేలు కూడా చేయించి సమాచారం సేకరించినట్లు తెలిసింది. డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా 10వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలుస్తానన్న ధీమాతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అంచనా వేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.



ముగిసిన నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, మే 22: ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి బుధవారం వేదపండితులు తీర్థవారి చక్రస్నానం చేశారు. దీంతో గత పదమూడు రోజుల నుంచి జరుగుతున్న వైశాఖ మాస నరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ బ్రహ్మోత్సవాలలో అధిక సంఖ్యలో భక్తులు వివిద ప్రాంతాల నుంచి తరలి వచ్చి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. దిగువ అహోబిలంలో 108 కలశాలతో నరసింహస్వామికి వేదపండితులు అభిషేకం నిర్వహించారు. వేకువజామున్నే ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం వైశాఖ మాస నరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలలో అభిషేకం నిర్వహించారు. భక్తులకు వేపండితులు తీర్థప్రసాదాలు అందించారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

జేడీ వరలక్ష్మి హెచ్చరిక



(మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), మే 22: వ్యాపారులు నాసిర కం, కల్తీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని జేడీ వరలక్ష్మి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఖరీఫ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 2,43,689 హెక్టార్లల్లో పత్తి పంట సాగవుతుందని అంచ నా వేసినట్లు జేడీ తెలిపారు. కర్నూలు జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందని అన్నారు. తొలకరి వర్షాలు పడుతుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇదే అదునుగా వ్యాపారులు, దళారులు నకిలీ, నాసిరకం పత్తి విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉందని, రైతులు లైసెన్సు పొందిన డీలర్లు వద్ద గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. దళారుల వద్ద లూజు విత్తనాలు, డూప్లికేట్ ప్యాకింగ్ ఉన్న విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని విజ్ఞప్తి చేశారు. విత్తన కొనుగోలు సమయంలో ప్యాకింగ్ ఉన్న విత్తనాలను తేదీ, ఎంఆర్‌పీ ధర తదితర వివరాలను తెలుసుకోవాలని చెప్పారు. రైతులకు విత్తన నాణ్యతపైన సందేహాలు ఉంటే సమీపంలోని అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబులో ఉచితంగా విత్తన నాణ్యత ధ్రువీకరణ పరీక్షలు చేయించి నిర్ధారించుకోవాలని అన్నారు. డీలర్లు ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు పత్తి విత్తనాలను విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా కటకటాల్లోకి తోయిస్తామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామని, ఆ బృందాలు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు(అర్బన్), మే 22: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 2,4, సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో రెండో సెమిస్టర్‌కు 2426కు 2178, నాలుగో సెమిస్టర్‌కు 8153కు 7494 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. నందికొట్కూరులో శ్రీసాయిరామ్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు, నంద్యాల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారని వెల్లడించారు.

జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలి

కర్నూలు(న్యూసిటీ), మే 22: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో ఈ నెల 24 జూన్ 1 వరకు పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వుల మేరకు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు, 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను యజమానులు మూసి వేయాలని అన్నారు. లేకపోతే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నంద్యాలలో సత్య ఏజన్సీస్ షోరూమ్ ప్రారంభం



సత్య ఏజన్సీస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎండీ జాన్‌సన్

నంద్యాల (కల్చరల్), మే 22: నంద్యాల పద్మావతి నగర్ సత్య ఏజన్సీస్ వారి 20వ షోరూమ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. బిల్డింగ్ యజమాని వి.సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారింభించారు. ఆయనతో పాటు సత్య ఏజన్సీ ఎండీ జాన్‌సన్, ఏపీ హెడ్ సెంథిల్, ప్రముఖ బ్రాండ్ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. సత్యా ఏజన్సీలో నంద్యాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సరసమైన ధరలతో ఎలక్ట్రిక్, హోమ్ నీడ్ వస్తువులు లభిస్తాయన్నారు. లాభాపేక్ష కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా తమ షోరూమ్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. నాణ్యతకు, నమ్మకానికి సత్య ఏజన్సీ మారుపేరు అని వారు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

10 ట్రాక్టర్లు సీజ్, కేసులు నమోదు : సెబ్ సూపరింటెండెంట్



సీజ్ చేసిన ట్రాక్టర్లను చూపుతున్న సెబ్ ఈఎస్

కర్నూలు(అర్బన్), మే 22: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్నూలు నగరంలోని మునగాలపాడు, మామిదాలపాడు, జోహరాపురంలో- 8 ట్రాక్టర్లు, పత్తికొండ సమీపంలోని పోతిరాళ్ల వంక వద్ద-2, ఆదోని మురవణి వద్ద 2 ట్రాక్టర్లను సీజ్ చేశామని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ పర్యటన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 131 కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, సీఐ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీ సస్పెన్షన్

నంద్యాల టౌన్, మే 22: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 39వ వార్డు సచివాలయం లో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా పని చేస్తున్న అబ్దుల్ రహి మాన్‌ను సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సచివాల య పరిధిలో ఏడాది జనవరి 1 నుంచి మే 16వ తేదీ వరకు వివిధ పన్నుల మొత్తాన్ని ఖజానాకు జమ చేయడంలో అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన రూ.2,21,363 మొత్తంలో రూ.1,56,651 ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు విచారణలో తేలినట్లు తెలిపారు.

తుంగభద్ర నదిలో పది మొసళ్లు!

మంత్రాలయం, మే 22: మంత్రాలయం మండలంలోని మాధవరం బ్రిడ్జి సమీపంలో తుంగభద్రనదిలో పది మొసళ్లు సంచారం చేస్తున్నాయి. మూడు రోజులుగా పెద్ద సైజులో ఉన్న మొసళ్లు సంచారం చేస్తుండటంతో పశులకాపర్లు, చేపల వేటగాళ్లు నదిలో తిరుగుతుండటంతో భయాందోళన చెందుతున్నారు. అటు ఆంధ్ర, ఇటు కర్నాటక నదీతీర గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కర్నాటక పోలీసులు, ఆంధ్ర పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి దాదాపు పదికి పైగా మొసళ్లు సంచరిస్తుండటంతో బ్రిడ్జిపై నుంచి మొసళ్లను చూసేందుకు ప్రజలు వస్తున్నారు. అయితే నదిలో దిగే రైతులు, పశువుల కాపర్లు, చేపల వేటగాళ్లు భయాందోళనలు చెందుతున్నారు. మత్స్యశాఖ అధికారులు తుంగభద్ర నదిలో ఉన్న పది మొసళ్లను వెంటనే పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఇరు రాష్ట్రాల్లో ఉన్న నదీతీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

● విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలి ● జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యుయేల్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 22: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారులను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యుయేల్ ఆదేశించారు. బుధవారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో విద్యాశాఖ అధికారులతో డీఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీకే కిట్లు, ఉచిత పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యూకేజీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది చదువుకుంటున్నదీ వివరాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపాలని సూచించారు. ఆర్‌టీఈ 12(1)(సి) చట్టం కింద జిల్లాలో 463 మంది పాఠశాలల్లో వివిధ కారణాలతో చేరలేదన్నారు. జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్, ఉపాధ్యాయులు లేని పాఠశాలలతో పాటు మిగులు ఉపాధ్యాయుల వివరాలను సేకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఏ ఏపీసీ విజయజ్యోతి కుమారి, జ్యోత్స్నరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో శామ్యుయేలు

● గైర్హాజరైన ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు:

కర్నూలు మాంటిస్సోరి పాఠశాలల్లో జరిగిన జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారుల సమీక్ష సమావేశానికి గైర్హాజరైన ఆరుగురు మండల విద్యాశాఖ అధికారులకు డీఈవో శామ్యుయేల్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గైర్హాజరుకు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంతా హడావుడే..!

● రూ.23 కోట్లతో ఏపీఈఆర్‌సీ భవనం నిర్మాణం

● 75-80 శాతం కూడా పూర్తికాని పనులు

● నేడు ప్రారంభానికి అధికారుల ఏర్పాట్లు

కర్నూలు, మే 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని రూరల్ మండల పరిధిలోని దిన్నదేవరపాడు గ్రామం దగ్గర 220 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో దాదాపు రూ.23 కోట్లతో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. 75-80 శాతం పూర్తయ్యాయని అధికారులు అంటున్నారు. పనులు పూర్తికాకుండానే గురువారం ఏపీఈఆర్‌సీ భవనం ప్రారంభోత్సవానికి విద్యుత్ అధికారులు సన్నాహాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, ఏటేటా విద్యుత్ చార్జీలు నిర్ణయించడంతో ఈ కమీషన్ కీలక పాత్ర పోషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నియమించే హైకోర్టు రిటైర్డ్ జడ్జి చైర్మన్‌గా పాలకవర్గం పని చేస్తున్నది. ప్రస్తుతం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కొనసాగుతున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం హైదరాబాదులోనే ఉండేది. ఏపీఈఆర్‌సీ ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి అమరావతికి అటూ ఇటూ తిరుగుతూ విధులు నిర్వహించాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో ప్రధాన కార్యాలయం హైదరాబాదు నుంచి అమరావతికి తరలిస్తూ 2019 జూలై నెలలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం కర్నూలుకు తరలించి దాదాపు రూ.23 కోట్లతో శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే.. పనులు పూర్తి కాకుండానే ఓ వైపు సిమెంట్ ప్లాస్టింగ్ చేస్తూ, మరో వైపు రంగులు వేస్తూ నేడు ప్రారంభోత్సవానికి హడావుడి చేయడం విమర్శలకు తావిస్తున్నది. అయితే.. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంది. ఆ తర్వాత ఏ ప్రభుత్వం వస్తుందో..? ముందే ప్రారంభిస్తే పోలా.. అని ఉన్నతాధికారులు హడావుడి చేస్తున్నట్లు సమాచారం. మరో 12 రోజుల్లో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఈ తరువాత భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభోత్సవం చేసే అవకాశం ఉన్నా..ఈ హడావుడి ఎందుకు అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయంపై మాట్లాడేందుకు అధికారులు ఇష్టపడడం లేదు.



పనులు చేస్తూ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్న ఏపీ ఈఆర్‌సీ భవనం



వీడిన జంట హత్య కేసు మిస్టరీ

గొడవ కారణంగానే మహిళల హత్య ● ఆటో డ్రైవర్ అరెస్టు

కర్నూలు, మే 22: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గార్గేయపురం చెరువులో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఇద్దరు మహిళల మృతదేహాల కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడు షేక్ మహబూబ్‌బాషాను అరెస్టు చేశారు. తాలుకా సీఐ శ్రీధర్, నాలుగో పట్టణ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించారు. సీఐలు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా... మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అరుణ, జానకిలు వేశ్యవృత్తికి అలవాటు పడి కర్నూలు కొత్తబస్టాండు ప్రాంతంలో తిరుగుతూ ఉండేవారు. స్థానిక లాడ్జీల్లో ఉంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ షేక్ మహబూబ్‌బాషాతో పరిచయం ఏర్పడింది. వీరిని తరచూ విటుల వద్దకు తీసుకెళ్లేవారు. అయితే గత వారం జానకితో ఆటోడ్రైవర్ గొడవ పడ్డాడు. జానకి తనకు తెలిసిన వారితో ఆటోడ్రైవర్ షేక్ మహబూబ్‌బాషాను కొట్టించింది. ఇది మనసులో ఉంచుకున్న ఆటో డ్రైవర్ ఎలాగైనా జానకిని హత మార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో జానకి, అరుణ ఆటో డ్రైవర్ మహబూబ్‌బాషాతో కలిసి దుస్తులు ఉతికేందుకు గార్గేయపురం చెరువు వద్దకు వెళ్లారు. వారిద్దరు దుస్తులు ఉతికి బయట ఆరబెట్టుకున్న తర్వాత స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. గమనించిన మహబూబ్‌బాషా జానకిని నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేశాడు. అప్రమత్తమైన అరుణ జానకిని కాపాడబోయి ఆమె కూడా నీటిలో మునిగిపోయింది. ఇద్దరు చనిపోయారని తెలుసుకున్న తర్వాత మహబూబ్‌బాషా అక్కడి నుంచి పరారయ్యాడు.

● కేసు ఎలా ఛేదించారంటే...

గార్గేయపురం చెరువులో ఆదివారం జంట మృతదేహాలు లభ్యం కావడంతో కలకలం రేపింది. దీంతో పాటు సమీపంలో మసీదు వెనుకాల మరో మహిళ మృతదేహం లభ్యం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. డీఐజీ, ఎస్పీలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించారు. కేసు ఛేదించేందుకు మూడు టీములను ఏర్పాటు చేశారు. టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషా, నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, తాలుకా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు సాగింది. మొదటగా ఆ ఇద్దరి మహిళలను గుర్తించిన పోలీసులు ఆ క్రమంలోనే కేసు దర్యాప్తు కొనసాగించారు. బస్టాండు సమీపంలో వెళ్లి ఆ ఇద్దరు మహిళల ఫొటోలతో ఆరా తీశారు. మమత అనే ఓ మహిళ వీరిని గుర్తించి స్థానికంగా ఓ లాడ్జిలో ఉంటారని సమాచారం ఇచ్చింది. లాడ్జికి వెళ్లి పోలీసులు విచారిస్తే.. శనివారం ఉదయం సమీపంలోని ఓ కల్లు దుకాణానికి వెళ్లినట్లుగా తెలిపారు. ఆ కల్లు దుకాణంలో వెళ్లి విచారించారు. కల్లు దుకాణం నిర్వాహకుడు ఆ ఇద్దరిని గుర్తించి ఆదివారం రోజు ఉదయం ఇద్దరు మహిళలతో పాటు ఆటో డ్రైవర్ మహబూబ్‌బాషా ఫుల్లుగా కల్లుతాగి ఆటోలో గార్గేయపురం చెరువు వద్దకు వెళ్లారని చెప్పారు. ఆ తర్వాత సాయంత్రం ఆటో డ్రైవర్ ఒక్కడే వచ్చాడని.. వారి దుస్తులు కూడా తీసుకువచ్చాడని అన్నారు. ఆ ఇద్దరు మహిళలు వేరేవారితో కారులో వెళ్లిపోయారని తనతో ఆటో డ్రైవర్ మహబూబ్ బాషా తెలిపినట్లు కల్లు దుకాణం నిర్వాహకుడు పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు ఆటోడ్రైవర్ మహబూబ్‌బాషాను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

గెలుపు సంబరాలు చేసుకోవద్దు: డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు, మే 22: ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని ఆర్వో దాసు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు రాజకీయ పార్టీలకు సూచించారు. బుధవారం పట్టణంలోని నందికొట్కూరు రిటర్నింగ్ అధికారి రూమ్‌లో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో 10 టేబుళ్లలో 25 రౌండ్లు ఉంటాయని, ఒక్కో టేబుల్‌కు ఒక్కో ఏజెంటును మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. మూడు అంచెల భద్రతా వలయంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం నెలకొన్న ఘటనల దృష్ట్యా ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చకూడదని వారు సూచించారు. జూన్ 6వ తేదీన ఎన్నికల కోడ్ ముగిసినా, 11వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్క రాజకీయ పార్టీ అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ సీఐ ప్రకాశ్ కుమార్, రూరల్ సీఐ విజయభాస్కర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, లాయర్ జాకీర్, తదితర పార్టీల నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

'ప్రైవేటు విద్యా సంస్థల్లో దోపిడీని అరికట్టాలి'

నందికొట్కూరు, మే 22: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలలో ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మద్రిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేపడుతున్నాయని, విద్యాశాఖ అధికారులు ప్రకటనలను ఏ మాత్రం పట్టించుకోకుండా అడ్మిషన్లు చేస్తూ డివిజన్ పరిధిలో వివిధ సంస్థలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని అన్నారు. పలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు పర్మిషన్ లేకపోయినా కూడా ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేశారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతులు లేకుడా నడుపుతున్న విద్యా సంస్థలపైన, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు విక్రమ్, పవన్, నిఖిల్, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎంఈవో-2 సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు పాఠశాల టీచర్లను వీధుల్లో తిప్పుతూ కరపత్రాలు, బ్యానర్లతో పిల్లల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి మోసగిస్తున్నారని ఆరోపించారు. అలాగే పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించడం లేదని, తరగతి గదులను రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారని, విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా క్రీడామైదానాలు కూడా లేవని వివరించారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వర్ధన్, రాజు ఉన్నారు.

'సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి'

బండిఆత్మకూరు, మే 22: గ్రామంలో సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని ఈర్నపాడు గ్రామ సచివాలయంలో బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ముఖ్యంగా సిబ్బంది వేళకు విధులకు హాజరు కావాలని తెలిపారు. అలాగే వేసవి అనంతరం వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పక నిర్వహించాలన్నారు. మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని కార్యదర్శి అబ్దుల్‌హక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, రమణయ్య ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు'

నంద్యాల టౌన్, మే 22: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విత్తన దుకాణాల యాజమాన్యాలను వ్యవసాయ శాఖ ఏవో ప్రసాదరావు హెచ్చరించారు. బుధవారం నంద్యాల పరిధిలో పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ రైతుల అవసరాలను అవకాశంగా మార్చుకొని డిమాండ్ పేరుతో కొందరు విత్తనాలను రైతులకు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారందరిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. విత్తన నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి కచ్చితంగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మినట్లు తేలితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదులు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీల్లో కిరణ్ హైబ్రీడ్స్ దుకాణంలో 5, ధరణి సీడ్స్ దుకాణంలో 5 విత్తన నమూనాలను సేకరించి వాటిని నాణ్యతా ప్రమాణాలను తెలుసుకోవడానికి ప్రయోగశాలకు పంపినట్లు ఏవో తెలిపారు.

ఆలయ భూములకు కౌలు వేలం

పాములపాడు, మే 22: మండలంలోని మద్దూరు గ్రామంలో ఆలయన భూముల కౌలుకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు ఈవో జనార్దన్, పర్యవేక్షణ అధికారి శశి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. గ్రామంలోని వెలసిన ఈశ్వర, వీరభద్ర, కేశవ, ఆంజనేయ దేవస్థానాలకు చెందిన దాదాపు 167 ఎకరాలకు సంబంధించి, వేలంలో సుమారు రూ.25 లక్షల మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది దేవదాయశాఖకు అధికంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

'పశువులకు టీకా తప్పనిసరి'

పాములపాడు, మే 22: పశువులలో ప్రబలే వివిధ రకాల రోగాలకు సంబంధత పాడి రైతులు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి భాస్కర్ సూచించారు. మండలంలోని బానుముక్కల గ్రామంలో బుధవారం గొంతువాపుకు 250 గేదెలకు, దూడలకు, జబ్బవాపుకు సంబంధించి 30 ఎద్దులకు టీకాలు వేశారు. అలాగే బానకచెర్ల గ్రామంలో గొంతువాపు, జబ్బవాపు వ్యాధులతో ఉన్న పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్న, గోపాలమిత్ర భాస్కర్ పాల్గొన్నారు.

'మానవతా సేవలో మమేకం కావాలి'

నంద్యాల (నూనెపల్లె), మే 22: మానవతా సేవలో సమాజంలోని వ్యక్తులు మమేకం కావాలని రిటైర్డ్ ఐఏఎస్ ఉమామహేశ్వరరావు పిలుపు నిచ్చారు. బుధవారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో హెచ్ఐవీ పాజిటివ్ బాధిత చిన్నారులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎస్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, విద్యాభారతి కార్యదర్శి రావు సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గత రెండేళ్ల నుంచి ప్రతి నెల రూ25,000తో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార కిట్లు మందులను డాక్టర్ రామకృష్ణారెడ్డి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వైఆర్‌జీ కోఆర్డినేటర్ ప్రసాద్, సుధారాణి, సుజాత, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మహానంది, మే 22: మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన నరాల మల్లేశ్వరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. కుటుంబ కలహాలతో బుధవారం మల్లేశ్వరి తన ఇంటిలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కమనీయం.. కల్యాణం



నల్లకాల్వ నరసింహస్వామి కల్యాణోత్సవం



గువ్వలకుంట్లలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం



నంద్యాలలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్, మే 22: లక్ష్మీసమేత నరసింహ స్వామి క్షేత్రంలో స్వామి జయంతి మహోత్సవాన్ని అశేష జనవాహిని నడుమ వైభవంగా నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ చతుర్దశి స్వాతి నక్షత్ర ముహూర్తాన్ని పురస్కరించుకుని స్వామివారి జయంతి వేడుకలను కన్నులపండుగగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు లోక కల్యాణార్థం పంచామృతాభిషేకం చేసి పంచసూక్తా లను, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా స్వామికి ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ వేడుకలో భాగంగా స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామి జయంతిని పురస్కరించుకుని నల్లకాల్వ నరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తడంతో క్షేత్రం కిటకిటలాడింది. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, ఊంజల్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నృసింహ స్వామి జయంతితో పాటు కల్యాణ మహోత్సవాన్ని ఒకే రోజు నిర్వహిస్తుండటంతో ఆత్మకూరు మండల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వేడుకకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం తరుపున అన్నవితరణ చేపట్టారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నృసింహ స్వామి జయంతి పురస్కరించు కొని ఆలయ నిర్వాహకుడు మధు, అర్చకుడు శ్రీరామమూర్తి నిర్వహణలో శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటి లక్ష్మీనృసింహ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా స్వామికి పంచామృత అభిషేకం, నవ కుంభారాధన, సామాన్య క్రియా హోమం నిర్వహించారు. అనంతరం స్వామి విశేష పూలంగిసేవ అలంకారం, సువర్ణరత్న ఆభరణాల అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం 11గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం సంజీవనగర్ శ్రీనివాసనగర్ పురవీధులగుండా ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారధి కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అశేష భక్తజనం మధ్య కమనీయంగా సాగింది. నల్లమల అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న చారిత్రాత్మక దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పార్వతి సమేత ఈశ్వరస్వామి కల్యాణ మహోత్సవం పుర ప్రముఖుల మధ్య ఈవో కార్తీక్, పురోహితులు లాల్ బహదూర్ శాస్త్రి, గ్రామస్థుల సమక్షంలో కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

సింహ వాహనంపై చెన్నకేశవస్వామి విహారం



సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన చెన్నకేశవ స్వామి

మిడుతూరు, మే 22: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శ్రీదేవి, భూదేవి సమేతుడై చెన్నకేశవ స్వామి వార్లను బుధవారం ఉదయం ప్రత్యేకంగా అలకరించి సింహవాహనంపై గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. పురవీధుల గుండా విహరించిన చెన్నకేశవుడు భక్తులకు దర్శనమిచ్చాడు.

గురుడవాహనంపై..

గ్రామంలోని పురవీధుల గుండా సాయంత్రం గురుడవాహనంపై విహరిం చారు. ముందుగా వేదపండితులు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి వార్లను అలంకరించారు. గర్భగుడి చుట్టు ముమ్మార్లు ప్రదక్షిణలు చేసిన అనంతరం, స్వామి వార్లను ప్రభ బండి రథంపై కూర్చోబెట్టి గ్రామంలోని వీధుల గుండా లాగారు.

వార్షిక వేడుకలు ప్రారంభం

కొత్తపల్లి, మే 22: మండలంలోని నందికుంట గ్రామ శివారులో వెలసిన విశ్వమాత పంచమ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు బానాల లక్ష్మీనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ విశ్వకర్మ పంచబ్రహ్మ ప్రధాన కలశ స్థాపన, దీక్షాకంకణ దారణ, అగ్ని ప్రతిష్ట, కలశ పూజ, పంచసూక్తాలచే హోమం, కుష్మాండ బలి తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో కొత్తపల్లి, ఆత్మకూరు మండలాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో పూజలు

మహానంది, మే 22: మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు పురస్కరించుకొని భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుండి తరలి వస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే కోనేరుల్లో పుణ్య స్నానాలు నిర్వహించుకొనేందుకు ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిల్చున్నారు. కాగా రాత్రి 10 గంటల వరకు కూడ మహానంది పరిసరాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

రాష్ట్ర కాలుష్య కంట్రోల్ బోర్డు సెక్రటరీ పూజలు

మహానంది క్షేత్రంలో బుధవారం రాత్రి రాష్ట్ర కాలుష్య నివారణ కంట్రోల్ బోర్డు సెక్రటరీ బి. శ్రీధర్ ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో స్వామి వారి మెమెంటోను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త హోమం

నంద్యాల రూరల్, మే 22: నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో అవధూత శివరామస్వామి ఆలయంలో గురుబలం కోసం దత్తహోమం బుధవారం నిర్వహించారు. ఈహోమంలో దాదాపు 150 జంటలు పాల్గొన్నాయి. నరసరావుపేటకు చెందిన కట్టా పద్మజా ఫౌండేషన్, ఎస్ఎస్ఎన్ కళాశాల అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో శివరామస్వామి ఆలయంలో ఉదయం గోపూజ, గణపతిహోమం, గ్రామదేవతలకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. వైశాఖ పౌర్ణమి గురువారం గోపూజ, భజన కార్యక్రమాలు, సాయంకాలం గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శివరామస్వామి భక్త మండలిసభ్యులు డాక్టర్, ఇంజేటి సదాశివరామిరెడ్డి, రవిబాబు పేర్కొన్నారు. . అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'నందికొట్కూరుకు తాగునీరు అందించాలి'

నందికొట్కూరు, మే 22: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం సమీపం నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు వెళ్తున్న పైప్‌లైన్ నుంచి నందికొట్కూరు పట్టణ దాహార్తిని తీర్చాలని ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు పదేళ్లు దాటినా పట్టణానికి మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మల్యాల దగ్గర సమ్మర్ స్టోరేజ్ ఉన్న ఆ నీరు ఏ మాత్రం పట్టణానికి సరిపోవడం లేదన్నారు. రెండేళ్ల క్రితం అలగనూరు రిజర్వాయర్ నుంచి రూ.120 కోట్లతో సమ్మర్ స్టోరేజీ స్థలం ఇంత వరకు కేటాయించ లేదన్నారు. ముచ్చుమర్రి వద్ద కృష్ణా బ్యాక్ వాటర్‌ను ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు తరలిస్తున్న పైప్‌లైన్ నందికొట్కూరు మీదుగా వెళ్తుందన్నారు. నందికొట్కూరు జగనన్న కాలనీ సమీపంలో 12 ఎకరాలు మిగులు భూమి ఉందని, ఆ భూమిలో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలగనూరు సమస్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు కేటాయించిన నిధులను ఇక్కడికి కేటాయించాలని ఆయన సూచించారు. అనంతరం కమిషనర్ సుధాకర్ రెడ్డికి ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సుధాకర్, శ్రీరాములు, ఉపేంద్ర, భాస్కర్ గౌడ్, రామకృష్ణ, చాంద్‌బాషా, మహేష్ , మహిళా రైతు సంఘం నాయకులు శ్యాల భాను, సోఫియాబి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి పెట్టాలి'

కొత్తపల్లి, మే 22: పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జవహర్‌బాబు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ శివరామయ్య ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బందితో తాగునీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణమే పరిష్కారంపై క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని సూచించారు. అలాగే మండలానికి పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ఓ ట్రాక్టరును కూడా మంజూరు చేసిందని, గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈవోఆర్డీ శివరామయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిసెంట్ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు వాటర్ టెస్టింగ్ కూడా చేయించి శుద్ధ జలాలు అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం'

ఆత్మకూరురూరల్, మే 22: ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దామని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో మంచి ఫలితాలు సాధించిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో 88 ఓఆర్ సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో, జోన్‌లో తొలి స్థానాన్ని సాధించినందుకు, 5.31 కేఎంపీఎల్ సాధించి జిల్లాలో రెండో స్థానం సాధించినందుకు డిపో మేనేజర్ ఉద్యోగులను అభినందించారు. అలాగే ఏప్రిల్ మాసంలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు ముర్తుజాబీ, గోవిం దమ్మ, జీఆర్ఎల్ రెడ్డి, ఎస్పీ నాయక్, సీఎస్ వాసులు, రూపారాణిలతో పాటు అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు శివారెడ్డి, పీఆర్సి రెడ్డి, ఎస్కే వలి, దరగయ్య, రహంతుల్లా ఎంఎస్ నాయక్‌కు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు.

'బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి'

ఆత్మకూరు, మే 22: రైతులు విత్తన కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీఏ ఆంజనేయ రైతులకు సూచించారు. బుధవారం ఆయన ఏవో విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆత్మకూరు పట్టణంలోని పలు విత్తన లైసెన్సు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో విత్తనాల నిల్వలు బిల్లులు రికార్డులను తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్బీకే సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

కోళ్లబావాపురంలో కార్డన్ సెర్చ్



కోళ్లబావాపురం లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నందికొట్కూరు రూరల్/నంద్యాల, క్రైం, మే 22: బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ముగ్గురు ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్ నిర్వహిస్తుండగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 6 మోటర్‌సైకిళ్లు సీజ్ చేశామని, 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలలో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని సూచించారు. జిల్లా మొత్తం 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. బుధవారం కౌన్సెలింగ్ కూడా ఇచ్చామన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఎన్నికలలో గెలిచిన వారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని చెప్పారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందకు ఈ పోలీసు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. మిడుతూరు, బ్రాహ్మణ కొట్కూరు, ముచ్చుమర్రి ఎస్ఐలు జగన్‌మోహన్‌యాదవ్, నాగార్జున, జయశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

మిడుతూరు: మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. మాసపేట, ఉప్పలదడియ, కలమందలపాడు గ్రామాల్లో నందికొట్కూరు సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. మిడుతూరు ఎస్ఐ జగన్ మోహన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'

గడివేముల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. మండలంలోని పెసరవాయిలో బుధవారం వారు పోలీసు సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు.

'అల్లర్లకు దిగితే చర్యలు'

బండిఆత్మకూరు: ఎన్నికల అనంతరం అనవసరంగా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని శింగవరం గ్రామంలో నంద్యాల రూరల్ సీఐతో పాటు బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున, గోస్పాడు ఎస్ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో కవాతు నిర్వహించారు.

'వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'

గోస్పాడు, మే 22: గోస్పాడు మండలం పసురుపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అమరలింగేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫక్రుద్దీన్, మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో అధికార పార్టీకి ఓట్లు వేయలేదని సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిలానీ బాషాపై వైసీపీ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడి, దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర సీపీఐ ద్వారా ఎన్నికల కమిషన్ దృష్టికి, జిల్లా, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు జిలానీ బాషా, గోకారి, నరసింహుడు, వెంకటేశ్వర్లు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరు

నంద్యాల రూరల్, మే 22: నంద్యాల మండలంలోని పలుపుర సచివాలయ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం పేరుతో స్థానిక ప్రజలకు అందుబాటులో లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. కానాల, మిట్నాల గ్రామాలలో సచివాలయ సిబ్బంది కొందరు విధులకు గైరహాజరయ్యారు. కానాల గ్రామ ప్రజలను వైద్య పరంగా చైతన్యం చేయడానికి బుధవారం శాంతిరాం వైద్యకళాశాల విద్యార్థులు పంచాయతీ కార్యదర్శి కోసం సచివాలయం ఎదుట చాలాసేపు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. చాలా సేపటికి పంచాయితీ కార్యదర్శి రాక పోవడంతో గ్రామంలో విద్యార్థులే ఆరోగ్య సూత్రాలను ప్రజలకు వివరించారు. అక్కడ అటెండర్ మాత్రం కార్యదర్శి ఎంపీడీవో కార్యాలయం వెళ్లినట్లు తెలిపారు. ఈవిషయంపై కానాల సచివాలయ కార్యదర్శిని ప్రశ్నించగా ఎంపీడీవో కార్యాలయం నుంచి వచ్చి వేరే గ్రామంలో ఉన్నానంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. మిట్నాల గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలు అయినప్పటికీ వెల్ఫేర్ అసిస్టెంట్ మినహా ఎవరూ రాలేదు. వెల్ఫేర్ అసిస్టెంట్‌ను అడగగా ఎంపిడీఓ కార్యాలయంలో మీటింగ్ ఉందంటూ పంచాయతీ కార్యదర్శి వెళ్లారని సమాధానం ఇచ్చారు. ఎంపీడీవో సౌభాగ్యమ్మను వివరణ కోరగా బుధవారం ఎలాంటి సమావేశం నిర్వహించలేదని చెప్పారు. మిట్నాల పంచాయతీ కార్యదర్శి మధ్యాహ్నం వరకు అనుమతి తీసుకున్నారు. కానాల కార్యదర్శి మధ్నాహ్నం వచ్చి ఓఫైల్‌పై సంతకం చేయించుకుని వెళ్లారని సిబ్బందికి వత్తాసు పలికారు.

సాక్షి గణపతికి అభిషేకం

శ్రీశైలం, మే 22: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, వలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహామంగళహారతులను సమర్పించారు.

జ్వాలా వీరభద్ర స్వామికి ..

శ్రీశైలం క్షేత్రంలో లోకకళ్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధ జలాలతో అభిషేకం నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్య కళారాధన



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మే 22: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం రంగారెడ్డిజిల్లా, అమీర్‌పేట్‌కు చెందిన స్పందన డ్యాన్సు అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, గణేశకౌత్వం, నటేశకౌత్వం, మూషికవాహన, మనసాస్మరామి, విజ్ఞరాజంభజే, చంద్రచూడు, శివపార్వతీ తదితర గీతాలకు కిరణ్మయి, మైథిలి, ప్రతీక, ధాత్రి, గాయత్రి, వైష్ణవి, సహస్ర, సుదీక్ష, జాహ్నవి, ఆద్య లాస్య, మనోజ్ఞ, శ్రావణి, శ్రేష్ఠ, సహస్ర, అభిజ్ఞ తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.

బ్యాంకు ఖాతాదారుల అవస్థలు

పాణ్యం, మే 22: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలతో స్టేట్ బ్యాంకు ఖాతాదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులు పంట రుణాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలు పూర్తవగానే కౌంటింగ్ కేంద్రాలుగా ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్, పార్వశీ కళాశాలలను స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలుగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో నంద్యాల జిల్లాలోని పాణ్యం నియోజకవర్గం మినహా ఇతర పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచారు. ఈ కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలన్నీ ఆర్జీఎం కంపౌండ్‌లో ఉండడంతోపాటు స్టేట్ బ్యాంకు ఇదే కాంపౌండ్‌లోనే ఉండడంతో ఖాతాదారులను బ్యాంకు వద్దకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రతా, పోలీసు దళాల భద్రత మధ్య ప్రహరీ గేట్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 12 వతేదీ నుంచి బయటి వ్యక్తులు లోపలికి వెళ్లకుండా చర్యలు చేపట్టడంతో ఖాతాదారులు తమ పనులు నిర్వహించుకోలేకపోతున్నారు. రైతులు పంటరుణాల రెన్యువల్, పంటరుణాల, అత్యవసర ఆర్థిక అవసరాలకు నగదు పొందడానికి లేని పరిస్థితి ఏర్పడడంతో ఖాతాదారులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. బంగారు రుణాలు తీసుకున్న ఖాతాదారులు సమయంలోపల వడ్డీ చెల్లించకపోవడంతో సమయం దాటి అదనపు వడ్డీ భారం పడుతుందని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు సేవలకు ఎన్నికల నియమావలను మినహాయించకపోవడంప ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేయడానికి సమయం దాటిపోతుండడంతో రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల అవసరాలను తీర్చాల్సిన ప్రభుత్వాలు ఖాతాదారుల సమస్యను దృష్టిలో ఉంచుకొని బ్యాంకును భద్రతనుంచి మినహాయించి ప్రత్యేక కంచె బ్యాంకుకు ఏర్పాటు చేసి ఖాతాదారుల సమస్యలను తీర్చాలని జిల్లా ఎన్నికల అధికారులను కోరుతున్నారు.



అనుమతి లేక గేటు వద్ద వేచి ఉన్న ఖాతాదారులు

ఇబ్బందులు పడుతున్నాం

కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. మా కుమారుడి పెళ్లి కోసం నగదు తీసుకోవడానికి ఆర్జీఎం బ్యాంకుకు వెళ్లగా అనుమతి ఇవ్వలేదు. వచ్చే నెల 6వ తేదీ వరకు బ్యాంకు లోపలికి అనుమతి లేదన్నారు. బ్యాంకు ప్రధాన గేట్లను పోలీసులు కంచెవేసి మూసివేశారు.

- మహేశ్వరి, కౌలూరు

అనుమతి లేదు

కౌంటింగ్ కేంద్రాల పరిధిలోని ఆర్జీఎం బ్యాంకులోపలికి వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదు. జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు బ్యాంకు వద్దకు వెళ్లనీయడంలేదు. కలెక్టర్ అనుమతితోనే బ్యాంకులోపలికి వెళ్లాల్సిఉంటుంది.

రవీంద్రనాథరెడ్డి, డీఎస్పీ, నంద్యాల

'ఓట్ల లెక్కింపునకు సహకరించండి'


రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో మల్లికార్జునరెడ్డి

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 4వ తేదీన నంద్యాల శాంతిరామ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపునకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ ఆర్వో మల్లికార్జునరెడ్డి కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాయని, అలాగే ఓట్ల లెక్కింపునకు కూడా సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని, ఆళ్లగడ్డ అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు 21 రౌండ్లకు పూర్తి అవుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లను ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్కిస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని, గెలిచినా, ఓడినా సమానంగా తీసుకోవాలని ఆయన సూచించారు. పట్టణంలో 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ అమలు ఉంటుందని గెలిచిన అభ్యర్థులు జూన్ 10వ తేదీ వరకు ఎలాంటి సంబరాలు జరుపుకోకూడదన్నారు. సమావేశంలో ఏఆర్వో నజీర్ అహమ్మద్, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల అభ్యర్థుల అనుచరులు, రూరల్ సీఐ హనుమంతనాయక్, రూరల్ ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాలు

బనగానపల్లె, మే 22: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నందివర్గం ఎస్ఐ తిరుపాలు హెచ్చరించారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడ్డా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోవెలకుంట్ల, మే 22: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివేందుకు పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఒకేషనల్ కోర్సులో విద్యను అభ్యసించేందుకు పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచిం చారు. ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 15 వరకు దరఖాస్తులు స్వీకరి స్తామని ఆమె తెలిపారు.

నేడు కోవెలకుంట్లలో బుద్ధ జయంతి

కోవెలకుంట్ల, మే 22: పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలు బుద్ధిష్టు సొసైటీ ఇండియా నంద్యాల జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు రెడ్డిపల్లె ఓబయ్య బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల రూరల్, మే 22: గత నాలుగు రోజులుగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. కొలిమిగుండ్లకు చెందిన ఎరికల అంజి(40) గత నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లాడు. తూము వద్ద నీరు పోవడం లేదని మిద్దె పైకి ఎక్కి చూస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు వచ్చి కళ్లు తిరిగి అంజి మిద్దె పైనుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అంజిని కర్నూలు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

కోవెలకుంట్ల, మే 22: పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. ఓ బాలిక సెల్‌ఫోను ఎక్కువ చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయింది. బాలిక ఆచూకీ కోసం బంధువుల వద్ద వెతికించారు. చివరికి ఇంటికి తిరిగి రాకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


డోన్‌లో విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

డోన్(రూరల్), మే 22: రైతులకు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రధాన రోడ్డులో ఉన్న విత్తనాల దుకాణాలను వారు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు. కంపెనీల వారిగా సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, కొనుగోలుకు సంబంధించిన బిల్లులను వారికి అందజేయాలని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ ఉన్నారు.

ప్యాపిలి: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజేష్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఫర్టిలైజరు దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న మందులనే విక్రయించాలని, లేనిపక్షంలో దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కమనీయం..లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



యాపదిన్నెలో లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డోన్(రూరల్), మే 22: మండలంలోని యాపదిన్నె గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారుతులిచ్చారు. అనంతరం అశేష భక్తుల మధ్య లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామ సమీపంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించారు. పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణేశ్వరరెడ్డి వృష భాలు మొదటి స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా వరదపల్లి గ్రామానికి చెందిన బెస్త శ్రీరాములు వృషబాలు ద్వితీయ స్థానంలో, అనంతపురం జిల్లా రేగడకొత్తూరుకు చెందిన భూమిరెడ్డి గౌతమ్ రెడ్డి వృషబాలు తృతీయ స్థానంలో, కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్ గ్రామానికి చెందిన నాగభూషణం వృషబాలు నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ వృషభాల యజమానులకు వరుసగా రూ.35వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అందజేశారు. అలాగే గ్రామంలో సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు.


నరసాపురంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కమనీయం.. నరసింహస్వామి కల్యాణం

రుద్రవరం: మండలంలోని నరసాపురం గడప లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య ఈ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణం కొనసాగించారు. గ్రామంలో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కరణం వెంకోబరావు, విశ్రాంతి వీఆర్వో సుబ్బారావు, కొత్తూరు రామలింగయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డోన్‌లో కార్డన్ సెర్చ్

- స్వాధీనం చేసుకున్న 135 సెల్‌ఫోన్లు
- రూ.1,48,500 నగదు స్వాధీనం
- నిందితుడి అరెస్టు



చిగురుమానుపేటలో సోదా నిర్వహిస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

డోన్(రూరల్), మే 22: డోన్ పట్టణంలోని చిగురుమానుపేటలో డోన్ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ అస్రత్‌బాషా, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డిలతో కలిసి అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. చిగురుమానుపేటలోని ఎరుకల రవి ఇంట్లో సోదాలు నిర్వహిస్తుండగా.. ఓ బ్యాగులో 130 సెల్ ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణం చిగురుమానుపేటలోని ఎరుకలి రవికి, అతని సమీప బంధువులైన ఎరుకల నవాజ్, సాదాబ్, ఎరుకల పవన్ తమిళనాడు రాష్ట్రంలో రద్దీగా ఉండే ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు దొంగతనాలు చేసుకుని వాటిని ఎరుకలి రవికి తెచ్చించేవారని, ఎరుకలి రవి హైదరాబాదులో వాటన్నింటిని గుట్టుగా అమ్మి నగదు తెచ్చేవాడని విచారణలో తేలినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఎరుకలి రవిని అదుపులోకి తీసు కుని అతని ఇంట్లో సోదాలు జరిపిన 130 సెల్‌ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల విలువ రూ.21 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఆళ్లగడ్డలో.. ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాలలో పోలీసు అధికారులు బుధవారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ చేపట్టారు. వీరి తనిఖీల్లో ఎలాంటి మారణాయుధాలు, మందుగుండు సామగ్రి వంటివి లభించలేదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రమేష్ బాబు, రూరల్ సీఐ హనుమంతనాయక్, రూరల్ ఎస్ఐ నరసింహులు, పట్టణ ఎస్ఐలు వెంకటరెడ్డి, నగినా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ స్వామి జయంతి


గుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

రుద్రవరం, మే 22: రుద్రవరం గ్రామ సమీపంలో కొలువుదీరిన గుట్టకొండ దొర్వి నరసింహస్వామి ఆలయంలో బుధవారం జయంతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు స్వామి అమ్మవార్లకు వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. జయంతి వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామి అమ్మవారి జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శేషఫణి శర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండలో వెలసిన చెంచులక్ష్మి సమేత పావన నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త పావన నరసింహమూర్తి, నాగరాజు, ప్రత్యూష, ప్రసాద్, శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అహోబిలంలో కోట్ల పూజలు


ఆలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్(రూరల్), మే 22: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఆయన వెంట డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు పరదేశీ మహేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ


చౌడేశ్వరీమాతను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

బనగానపల్లె, మే 22: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆల యంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా పల్లకీ సేవ, సహస్ర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యం లో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ఊయలసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

స్వాతి నక్షత్ర వేడుకలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

బేతంచెర్ల, మే 22: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి జన్మ నక్షత్రమైన వైశాఖ శుద్ధ చతుర్దశి స్వాతి నక్షత్రం వేడుకలు ఆలయ వేద పండితులు, అర్చకులు వేదమంత్రోచ్చరణాల మధ్య బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉప కమిషనర్ ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పుణ్యాహవాచనం, నవ కలశారాధన, అగ్ని ప్రతిష్ట, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ సీతారామచంద్రుడు, ఆలయ ధర్మకర్తలు ఆకుల రమణ, మద్దయ్య, శివనాయుడు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి గ్రామోత్సవం

కోవెలకుంట్ల, మే 22: పట్టణంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మో త్సవాలలో భాగంగా ఆరో రోజు స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామి వారిని పల్లకిలో ఆలయం నుంచి రంగరాజు పేట మెయిన్ బజార్ గడ్డవీధి తదితర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై భక్తులకు పాండురంగ విఠలేశ్వరుడు దర్శనమి చ్చారు. కార్యక్రమంలో వేదపండితులు వేణుగోపాలచారి, సుదర్శనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమంత వాహన సేవ


హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

చాగలమర్రి, మే 22: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం హనుమంతోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇత్తడితో తయారు చేసిన హనుమంత వాహనంపై చెన్నకేశవ ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి.. ముగ్గురిపై కేసు

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఆదర్శ అభ్యుదయ కాలనీలో నివాసం ఉంటున్న తమపై దాడి చేశారని నొస్సం దస్తగిరి, గౌసియా దంపతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న కుమార్, తిరుపతి, ఆయన భార్య ఆటోలలో వచ్చి తమను ఇంటి వద్ద నానాదుర్భాషలాడుతూ కర్రలు, రాళ్లలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం: ఏపీడీ


మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివుడు

చాగలమర్రి, మే 22: పండ్ల తోటల సాగు లాభదాయకమని జిల్లా క్లస్టర్ ఉపాధి ఏపీడీ సాంబశివుడు అన్నారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1,600 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని, ఇప్పటి వరకు 850 ఎకరాలు గుర్తించామని చెప్పారు. కూలీలకు వంద పనిదినాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 96 శాతం ఉపాధి పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం 5 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. 16 రకాల పండ్ల తోటల మొక్కలను రైతులకు పంపిణీ చేస్తామని అన్నారు. వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల సాగుకు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. మూడేళ్ల పాటు రైతులకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని సూచించారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో రైతులను పండ్ల తోటల సాగుకు ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధి కూలీల మస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'


గుంప్రమాన్‌దిన్నెలో ప్రజలకు సూచనలిస్తున్న ఎంపీడీవో

శిరివెళ్ల, మే 22 : ప్రజలు తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో ఫణి రాజకుమారి సూచించారు. మండలంలోని గుంప్రమాన్‌దిన్నె ఎస్సీ కాలనీలో ఆమె బుధవారం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలోని రహదారుల్లో అపరిశుభ్రత నెలకొనడంతో అంటువ్యాధుల పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్య చెత్తా చెదారం వేయకుండా, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

'రూ.3 కోట్లతో పాఠశాల అభివృద్ధికి ప్రతిపాదనలు'

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): అహోబిలం ఆశ్రమ గిరిజన పాఠశాల అభివృద్ధికి రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఐటీడీఏ డీఈ రఘురామిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుకునే గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు పాఠశాలను క్షున్నంగా తనిఖీ చేసి ప్రతిపాదనలు తయారు చేసినట్లు వివరించారు. ఆశ్రమ గిరిజన పాఠశాలను ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈ ప్రదీప్, హెచ్‌ఎం సత్యా ఉన్నారు.

నోట్ పుస్తకాల మంజూరు

చాగలమర్రి, మే 22: మండలంలోని 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈవో న్యామతుల్ల తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 31 వేల నోట్ పుస్తకాలు జిల్లా కేంద్రం నుంచి సరఫరా చేశారని చెప్పారు.

'విధుల్లో నిర్లక్ష్యం తగదు'

రుద్రవరం, మే 22 : అటవీశాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించడం తగదని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. బుధవారం రుద్రవరం రేంజ్‌లో వృక్షాలను పరిశీలించారు.

27న ఆలయ భూముల కౌలు వేలం

శిరివెళ్ల, మే 22: మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని ఆలయాలకు చెందిన భూములకు ఈ నెల 27న బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి గంటా వేణునాథరెడ్డి బుధవారం తెలిపారు. చెన్నూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 20.42 ఎకరాల భూములకు సాయంత్రం 4 గంటలకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. 2024-25 సంవత్సరానికి గాను ఏడాది కాలపరిమితితో నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనేందుకు రైతులు రూ.2 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు.

'వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి'

చాగలమర్రి, మే 22: గ్రామాల్లో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి సూచించారు. బుధవారం 13 సచివాలయాల పరిధిలో చిన్నారులకు వైద్య సిబ్బంది ఇమ్యూనైజేషన్‌ను నిర్వహించారు. చిన్నారులకు వివిధ వ్యాధులు ప్రబలకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. హెచ్ఈ వెంకటమ్మ, ఆశా వర్కర్లు ఉన్నారు.

అంకిరెడ్డిపల్లెలో తాగునీటి ఎద్దడి

నీటి కోసం పనులు వదులుకుంటున్నామని గ్రామస్థుల ఆవేదన


ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

కొలిమిగుండ్ల రూరల్, మే 22: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారింది. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర తాగునీటి సరఫరాతో ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. గ్రామంలో సుమారు 5వేలకు పైగా జనాభా నివసిస్తున్నా, సగానికి పైగా ప్రజలు సక్రమంగా నీరు సరఫరా కావడంలేదని వాపోతున్నారు. ప్రధానంగా గ్రామంలోని కుంట వీధి, ఎర్రబద్దెల ప్రాంతం, మీట్టమీద, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. అరకొరగా నీటిని ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా అవి ఏమాత్రం సరిపోవడం లేదని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.